క్లుప్తంగా

నేడు 3,5 వార్డుల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని 3,5వ వార్డుల్లో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు తెలిపారు. 5వ వార్డు పరిధిలో ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పశువులకు టీకాలు



పి.ఆమిటిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: వర్షాకాలంలో పశువులకు వచ్చే లంపి స్కిన్ వైరస్(బొబ్బరు వ్యాధి) నివారణకు పశువైద్య సిబ్బంది టీకాలు వేస్తున్నారు. మండలంలోని పి.ఆమిటి పంచాయతీ పరిధిలోని కారివలస, మొరంగూడ, పి.ఆమిటి గ్రామాల్లోని పశువులకు పశుసంవర్ధక శాఖ సహాయకులు కె.మణికంఠేశ్వరి బుధవారం టీకాలు వేశారు. పాడిరైతులు తమ వద్ద ఉన్న పశువులకు లంపి వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు.

విస్తారంగా వర్షాలు



వీరఘట్టంలో కురుస్తున్న వర్షం



భామినిలో..

భామిని, వీరఘట్టం, కొమరాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. పగలంతా ఎండతీవ్రతతో అల్లాడి ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. రహదార్లు జలమయం కావడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. లోతట్టు ప్రాంతాలు, పంటపొలాల్లో నీరు చేరింది. నీరు లేక ఎండిపోతున్న పంటలకు ప్రస్తుతం కురిసిన వర్షంతో ప్రాణం పోసినట్లయిందని రైతులు అంటున్నారు.

గిరిజన ద్రోహి దారునాయక్

- టీఎస్ఎఫ్, టీపీఎస్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్ గిరిజన ద్రోహి అని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణునాయక్ ధ్వజమెత్తారు. పట్టణంలో స్థానిక విలేకరులతో వారు బుధవారం మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అవినీతికి పాల్పడ్డారంటూ దారునాయక్ ఇటీవల చేసిన ఆరోపణలను వారు ఖండించారు. నిజాయితీకి మారుపేరుగా, గిరిజనులకు ఆరాధ్య దైవంగా ఎదిగిన రాజన్నదొరపై నిరాధార ఆరోపణలు చేసిన దారునాయక్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా ముందుకు తీసుకుపోవడంలో కీలక పాత్ర పోషిస్తున్న రాజన్నదొరను నైతికంగా దెబ్బతీయాలనే కుట్ర పూరితమైన ఆలోచనతోనే టీడీపీ నేతలు ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గిరిజనులు అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అనునిత్యం పరితపిస్తున్న గొప్ప వ్యక్తి రాజన్నదొర అని పేర్కొన్నారు. దారునాయక్ ఎందరో గిరిజనులను మోసం చేశారని ఆరోపించారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని దారునాయక్ తన స్థాయిని మరచి ఉప ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం సహించబోమని హెచ్చరించారు. తక్షణమే రాజన్నదొరకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్, టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్‌నాయక్ ఉన్నారు.

ఉద్యాన పంటలకు ఈ క్రాప్

సీతానగరం: రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలను వరి పంటలతో పాటు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకొని ప్రభుత్వం సమకూర్చిన బహుళ ప్రయోజనాలు పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బగ్గందొరవలస మలేషియా నుండి సీడ్ తెచ్చి పెంపకం చేస్తున్న శ్రీనివాసా పామాయిల్ నర్సరీని ఆయన బుధవారం సందర్శించారు. రైతులు పండించిన పంటలు విక్రయించాలన్నా, ఏ కారణం చేతనైనా పంట నష్టం వాటిల్లినా ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించి ఆదుకుంటుందని, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయ సమయంలో ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు.



కురుపాం: సరస్వతీ విద్యానికేతన్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



గరుగుబిల్లి: శ్రీసాయినికేతన్ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సరస్వతీ విద్యానికేతన్‌లో శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి



భామిని: భామినిలో రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు



వీరఘట్టం: చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారి

శ్రీకృష్ణుడి జన్మాష్టమి(కృష్ణాష్టమి) వేడుకలను వాడవాడలా బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను చిన్నికృష్ణుడు, గోపికలుగా అలంకరించి మురిసిపోయారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో శ్రీష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో అలరించారు. యువత వీధుల్లో ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు. బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం, తెర్లాం శ్రీకృష్ణుడి ఆలయం, పాలకొండ నగరపంచాయతీ పరిధి కోమటిపేటలో కొలువుదీరిన రాధాకృష్ణ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. – పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



భామిని: బత్తిలిలో ఊరేగింపుగా వెళ్తున్న చిన్నారులు



పాలకొండ: పట్టణంలో మార్కెట్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు



పాలకొండ రూరల్: రాధాకృష్ణుల వేషధారణలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన చిన్నారులు

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



గారవలస బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కళ్లికోట నుంచి గారవలస గ్రామానికి సుమారు 3.1 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. రహదారి నిర్మాణానికి ఉపాధిహామీ నిధుల నుంచి రూ.1.50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు రహదారి సదుపాయం కల్పించడంతో గారవలస గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ డి.జనార్దనరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, కొమరాడ, శివిని పీఏసీఎస్ చైర్మన్లు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, ఐటీడీఏ ఈఈ శాంతేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వీరఘట్టం: మృతుని భార్యకు బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ ఉమామహేశ్వరరావు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామానికి చెందిన చిన్ని పోలయ్య(36) మంగళవారం మృతి చెందారు. మృతుడు వైఎస్సార్ బీమా లబ్ధిదారుడు కావడంతో తక్షణ సాయంగా రూ.10 వేలును సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు బుధవారం మృతుని భార్యకు అందజేశారు. మిగిలిన బీమా పరిహారం నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని నులకజోడు గ్రామానికి చెందిన వివాహిత మజ్జి కృష్ణవేణి(54) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలు వైఎస్సార్ బీమా లబ్ధిదారు కావడంతో ఆమె కుమారుడు సాయిరాజ్‌కు బుధవారం తక్షణ సాయం కింద రూ.10 వేలును వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేస్‌పట్నాయక్, ఉపసర్పంచ్ కొన్న తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాపుపిల్లి విశ్వనాథం అందజేశారు. వైఎస్సార్‌బీమా పరిహారం బాధిత కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా ఉంటుందన్నారు.

సామాజిక తనిఖీలకు సహకరించండి: ఏపీఓ



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలను ఈ నెల 2 నుంచి నిర్వహించనున్నట్లు ఏపీఓ శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 31 పంచాయతీల్లో రూ.20 కోట్ల 28 లక్షలతో ఉపాధి పనులు చేపట్టగా..అందులో రూ.15.68 కోట్లు వేతనాల కోసం, రూ.4.68 కోట్లు మెటీరియల్ రూపంలో ఖర్చుచేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించిన అన్ని రికార్డులను ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ రాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. ఫీల్డ్‌లెవెల్‌లో ఆడిట్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇద్దరు ఎస్‌ఆర్‌పీలు, ఆరుగురు డీఆర్‌పీలు ఆడిట్‌ను పర్యవేక్షిస్తారన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

భామిని: మండలంలోని 136 పోలింగ్ బూత్‌ను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పాలకొండ ఆర్‌ఓ కె.కల్పనాకుమారి బుధవారం పరిశీలించారు. బూత్‌లోని అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నల్లరాయిగూడ జీపీఎస్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో పలు పాఠ్యాంశాలను చదివించారు. ఉపాధ్యాయుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

పాలకొండ రూరల్: సాధారణ రైతులతో పాటు ఉద్యానవన రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలను అందిస్తోందని సంబంధిత శాఖ అధికారి తమ్మినేని అమరేశ్వరి బుధవారం తెలిపారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలో పామాయిల్ తోటలు వేయదలచిన ఔత్సాహికులు, ఇదివరకే యిల్‌పామ్ తోటలు సేద్యం చేస్తున్న రైతులు తమ తోటల చుట్టూ రక్షణ నమిత్తం సిమెంట్ పోల్స్ వేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా రాయితీ పొందవచ్చన్నారు. ఇందుకోరకు 8099151997 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



రెల్లివీధిలో రక్తపూతలు సేకరిస్తున్న అర్బన్ వైద్యసిబ్బంది

పాలకొండ రూరల్: వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరమని అర్బన్ హెల్త్ సహాయకులు రామశేషు అన్నారు. నగరపంచాయతీ పరిధిలో రెల్లివీధి, గొల్లవీధి, శిరిపోతన్న వీధి పరిసరాల్లో బుధవారం ప్రత్యేక వైద్య సేవలు అందించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ సీజన్‌లో వచ్చే వైరల్ జ్వరాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు.

విరాళం అందజేత



విరాళాన్ని సమితి కన్వినర్‌కు అందిస్తున్న దాత శివప్రసాద్

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి సేవామందిరం అభివృద్ధికి, నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహణ కోసం పట్టణానికి చెందిన బత్తుల శివప్రసాద్ రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని సత్యసాయి సమితి కన్వీనర్ కె.సుధాకర్, యు.అచ్యుతరావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యాన్నదాన పథకం ద్వారా పట్టణం, మండలం పరిధిలో వందల మందికి భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగించేందుకు దాతలు సహకరించాలని కోరారు.

ఓటరు జాబితాపై గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న నాయకులు, గ్రామపెద్దలు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఓటర్ల జాబితాపై అందిన ఫిర్యాదులపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఇటీవల బీఎల్‌ఓలు నిర్వహించిన ఇంటింటి ఓటరు సర్వేలో అనర్హులను తొలగించలేదని ఐటీడీఏ పీఓకు అందించిన ఫిర్యాదు మేరకు గ్రామంలో సభ నిర్వహించారు. ఆ ఫిర్యాదు తప్పుడు ఫిర్యాదుగా గ్రామస్తులు తీర్మానించారు. ఈ సమావేశంలో సర్పంచ్ రాయి వనజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శాసుబిల్లి జనార్దనరావు, ఎంపీటీసీ ప్రతినిధి కరణం నారాయణరావు, గ్రామ పెద్దలు పతివాడ మోహన్, బచ్చల రాము, బలగ నాయుడుబాబు, లంకమోహన్, బీఎల్‌ఓలు పి.మేఘన, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



వైస్ ఎంపీపీ శరత్‌బాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన నాయకుడు, వైస్ ఎంపీపీ సంగిరెడ్డి శరత్‌బాబు ఇటీవల డెంగీ రావడంతో చికిత్స తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ డి.జనార్దనరావు, పలువురు నాయకులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

పాలకొండ: మండలంలోని అంపిలి గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లోలుగు అప్పలనాయుడు(87) మంగళవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గతంలో అంపిలి సర్పంచ్‌గా పనిచేయడంతో పాటు జగన్నాథ స్వామి ఆలయ చైర్మన్‌గా, గోపాలపురం నీటి సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం సంతాపం తెలియజేశారు. అప్పలనాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. ఆయన కుమారుడు, అంపిలి సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావును పమార్శించి ఓదార్చారు. వారితో పాటు పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ రావు, పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలను బుధవారం ఉదయం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్‌సీఎం లూర్థుమాత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపకశాఖ వినియోగించే పలు పరికరాలను ప్రదర్శించి, వాటిని ఎలా వినియోగించాలో వివరించారు.

పాఠశాలకు ప్రింటర్, స్కానర్ వితరణ



పాఠశాలకు ప్రింటర్, స్కానర్‌ను అందజేస్తున్న కొత్తకోట వెంకటసురేష్‌కుమార్

కురుపాం: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబాపూలే బాలుర ఆశ్రమ పాఠశాలకు కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్‌కుమార్ రూ.12 వేలు విలువైన ప్రింటర్, స్కానర్‌ను వితరణ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ కిమిడి భూషణరావుకు వాటిని అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం వాటిని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోలారావు పాల్గొన్నారు.